క్లుప్తంగా

పత్తిలో తెగుళ్ల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గూడూరు: మండలంలోని జులకల్లు గ్రామంలో పత్తి పంటపై సమగ్ర సస్య రక్షణలో భాగంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తి పంటలలో గులాబీ రంగు కాయ తొలుచు పురుగు నివారణ పై కొత్త టెక్నాలజీని శాస్త్రవేత్తలు వివరించారు. ఆర్ఏఆర్ఎస్ నంద్యాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు లక్ష్మీ కల్యాణి, మోహన్ విష్ణు, శివ రామకృష్ణ తదితరులు పత్తి పొలంలో రైతులకు ప్రదర్శన చేసి చూపారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలిరెడ్డి, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, స్థానిక ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి, టెస్టింగ్ ఏఓ దస్తగిరి రెడ్డి ,డీఆర్సీ ఏఓ శషిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



కొత్తగా మంజూరైన లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ ఏసేపు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలో కొత్తగా 524 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ తెలిపారు. అయన మాట్లాడుతూ మంజూరైన కొత్త పింఛన్లను ఆయా గ్రామాల్లో సోమవారం పంపిణీ చేసినట్లు వివరించారు. అర్హత ఉన్నవారందరికీ ప్రతి ఆరునెలలకోసారి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన వారందరూ ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదు చేస్తున్న దృశ్యం

సి.బెళగల్: పంటలు సాగు చేసుకుంటున్న రైతులు తప్పని సరిగా ఈ – పంట నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. సోమవారం అయన మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ మారెప్ప ఉన్నారు.

శ్రీకృష్ణ జయంతిని విజయవంతం చేయండి

పాణ్యం : మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ ఆలయంలో నిర్వహించే జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని శ్రీకృష్ణ ఆలయ కమిటీ, యాదవ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ ఈనెల 6 నుంచి ఉత్సవాలు జరుగుతాయన్నారు. 6న స్వామి వారి కల్యాణం నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చేప్పారు. కృష్ణ జయంతి సందర్భంగా ఆలయ ప్రాగంణంలో ఉట్టికొట్టే కార్యక్రమం, కొలాటం, గ్రామోత్సవంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ట్రాక్టర్ అపహరణ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్ అపహరణకు గురైంది. ఈ మేరకు సోమవారం బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంటి ముందు పెట్టిన ట్రాక్టర్‌ను ట్రాలీతో సహా తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు రైతులు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతులు భూ రీ సర్వేలో భాగంగా ఏర్పడిన సమస్యలపై తహసీల్దార్ శేషఫణికి అర్జీలు ఇచ్చారు.

రేపు వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్ట్యబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం ఈనెల 6వ తేదీ కర్నూలు నగరంలో జరుగుతుందని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన (కేంద్రీయ ప్రధాన కార్యదర్శి) కార్యదర్శి మిలింద్ పరాండే హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం, లీగల్ సెల్ సమావేశం, షష్ట్యబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

- పాలనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- 406 మందిని నాలుగు బ్యాచ్‌లుగా వర్గీకరణ
- ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో శిక్షణ



శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు

కోడుమూరు: గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి, సమర్థవంతంగా ప్రభుత్వ పథకాల నిర్వహణే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కర్నూలు జిల్లాలోని గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 స్థాయి వరకు 484 పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న 406 మందికి కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 29 నుంచి శిక్షణ ఇస్తున్నారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచాయతీల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పేదల సంక్షేమం, గ్రామ స్వరాజ్యానికి నవరత్నాల పథకాల అమలు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర ఎన్నో కార్యక్రమాలు పంచాయతీల పరిధిలో అమలవుతున్నాయి. ఈ పథకాలపై కార్యదర్శులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా గ్రామ పరిపాలనపై పంచాయతీ కార్యదర్శులు పట్టుసాధించడం కోసం ప్రభుత్వం శిక్షణను ప్రారంభించింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గత నెల 29 నుంచి ఈ నెల 24 వరకు శిక్షణ జరుగుతోంది. ఒక్కో బ్యాచ్‌లో వంద మందికి ఆరు రోజులపాటు నాలుగు విడతలుగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. పంచాయతీల పరిధిలో అమలవుతున్న వివిధ పథకాలపై రీసోర్స్ పర్సన్లతో పాటు ఉపాధిహామీ, ఇతర శాఖల అధికారులు హాజరై కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ నేపథ్యంలో పంచాయతీ సాధారణ పరిపాలనకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. ఒక్కో మండలంలోని మొత్తం పంచాయతీ కార్యదర్శుల్లో మూడో వంతు మందికి ఒక్కో బ్యాచ్ ప్రకారం శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణలోని అంశాలు..

మొదటిరోజు: స్థానిక స్వపరిపాలన, గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, అంతర్గత రోడ్లు, శ్మశానాలు, జల్‌జీవన్ మిషన్, వీధిలైట్ల నిర్వహణ.
రెండవ రోజు: పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, ఆర్థిక వ్యవహారాలు, 15 ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్ను మదింపు, వసూళ్లు, పంచాయతీల బడ్జెట్, రికార్డుల నిర్వహణ, ప్రతిభ పురస్కారాలు, జవాబుదారీతనం, క్రమశిక్షణ, ఆడిట్ తదితర అంశాలు.
మూడవ రోజు: లేఅవుట్లు, భవన నిర్మాణ నియమాలు, జగనన్న భూహక్కు-భూరక్ష.
4, 5 వ రోజులు: డ్రాఫ్టింగ్ లెటర్స్, కాండాక్ట్ రూల్స్, సీసీఏ రూల్స్, డీఓఎం అండ్ లీవ్ రూల్స్.
ఆరవ రోజు: నవరత్నాలు, జాతీయ ఉపాధిహామీ పథకం, మూల్యాంకనం.

పాలన మరింత పాదర్శకత

గ్రామీణ ప్రజలకు మెరుగైన పాలనే అందించే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. పాలన మరింత పారదర్శకంగా ఉండేందుకు, ప్రభుత్వ పథకాల అమలుపై కార్యదర్శులందరికీ పూర్తిగా అవగాహన కల్పించేందుకే ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తోంది. కోడుమూరు మండలంలోని పంచాయతీలు సాధారణ పరిపాలనకు ఇబ్బందులు కలుగకుండా ప్రణాళిక బద్ధంగా పంచాయతీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమానికి వెళ్తున్నారు.
– ఆర్.మంజుల, ఈఓఆర్డీ, కోడుమూరు

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

కర్నూలు (న్యూటౌన్): గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు కల్పించి, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ డిమాండ్ చేశారు. సోమవాం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజు రోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ ప్రజల నడ్డివిరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కర్నూలు రూరల్ తహసీల్దార్ శివ రాముడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.
కల్లూరు: ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రం అందించారు.

స్పందన దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

గూడూరు: స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాధవీలత, పీఆర్ ఏఈ గోపాల్‌రావు, వైకేపీ ఏపీఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ప్యాలకుర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. సోమవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు, గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్యాలకుర్తిలోని నేసే, ముస్లిం, యాదవ, చాకలివీధి వాసులు మాట్లాడుతూ తమకు పాత మట్టిమిద్దెల స్థానంలో జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని, తమ కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అర్హులైన వారిని గుర్తించి గృహాలు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి అవసరమైన ప్రతి పాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఎమ్మెల్యే మండల అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమైందని, కుల మతం భేదం లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ప్రజారంజకమైన పాలన అందజేస్తున్న జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు శ్రీనివాసులు, రాముడు, అయ్యన్న, మిన్నెల్లె, మాదన్న, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ లబ్ధి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- ఏ గోకులపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలతో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఏ గోకులపాడు గ్రామంలో సర్పంచ్ గిడ్డమ్మ, నాయకులు మధుసూదన్ రెడ్డి సుధాకర్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ప్రామాణికంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ పాలనకు ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ అందించిన పాలనలో తేడాను గమనించాలన్నారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని కోరారు.

ఇళ్ల ముంగిటికే సేవలు

పల్లెల్లో గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తెచ్చారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్ రెడ్డి, శ్యామసుందర్ రెడ్డి హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

కల్లూరు : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్ పి.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. టీడీపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేమట ఉప సర్పంచ్ ఎన్నిక

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం రేమట గ్రామంలో ఉప సర్పంచ్‌గా ఎం గోకారావు ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని రేమట గ్రామంలో ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగిందని స్టేజ్2 అధికారి (కర్నూలు రూరల్2 ఎంఈఓ) వినోద్ కుమార్ వెల్లడించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు (అర్బన్) : సాంకేతిక సమస్యల కారణంగా మంగళవారం నగరంలోని పలు కాలనీల్లో విద్యుత్ కోతలు ఉండనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఈఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ వార్త, నందికొట్కూరు, నన్నూరు, 11కేవీ సి.క్యాంప్ ఫీడర్ల పరిధిలోని గణేష్ నగర్, శ్రీరాం నగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జయరాం నగర్, చెక్‌పోస్టు ఏరియా, ఫోర్త్ క్లాస్ కాలనీ, ధన లక్ష్మి నగర్, మారుతీ మెగాసిటీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి



పీఏసీఎస్‌లో భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తమ కృషి చేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పాగుల చంద్రశేఖర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయ అవరణలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించనున్న గోడౌన్, గోల్డ్‌లోన్ స్ట్రాంగ్ గది, ఆఫీస్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పీఏసీఎస్‌లకు కావాల్సినన్ని నిధులు కేటాయించడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బయటి మార్కెట్ కంటే సొసైటీలో తక్కువకు అమ్ముతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల మేనేజర్ ఉశేన్‌బాషా, అసిస్టెంట్ మేనేజర్ సందీప్, సీఈఓలు ఆదినారాయణ, వీర భద్రుడు రైతులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మనప్రభుత్వం'

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సోమవారం తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సమస్యలతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకుంటారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కొత్తూరులో..

కోడుమూరు రూరల్ : మండలంలోని కొత్తూరు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

ప్రకృతి ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యం



కూరగాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఓర్వకల్లు : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా వుంటుందని మార్కెటింగ్ అండ్ ధ్రువీకరణ అధికారి ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని హుసేనాపురం సంత మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతి వల్ల పండించిన ఆకుకూరలు, కూరగాయలను విక్రయించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని హుసేనాపురంలో గ్రామైక్య సంఘానికి చెందిన వెంకటేశ్వరమ్మ అనే మహిళా రైతు పండించిన ఏ గ్రేడ్ మోడల్‌కు సంబంధించిన మిరప, బెండ, టమోట, అలాగే అదే గ్రామంలోని జన్మభూమి గ్రామైక్య సంఘానికి చెందిన వీరభద్రబాయి పత్తిలో అంతర పంటగా సాగుచేసిన ఆకు కూరలు, కూరగాయలు విక్రయించినట్లు తెలిపారు. అదేవిధంగా ఉప్పలపాడు గ్రామానికి చెందిన గోపినాథ్‌రెడ్డి అనే రైతు పండించిన పసుపు, కారం, మినుపు బేడలు, పెసర బేడలు మార్కెట్‌లో అమ్మినట్లు వెల్లడించారు. మార్కెట్‌లో బయటి ఉత్పత్తుల కంటే ప్రకృతి పంట ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయించినా వాటిని కొనేందుకు ప్రజలు మొగ్గుచూపడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు వెంకటరమణ, కాసీం, సోమేశ్వరమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ జగదీష్‌చంద్రా రెడ్డి

గడివేముల: పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని నంద్యాల జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం గడిగరేవుల గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అందరూ అమలు చేయాలని కోరారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ మొల్ల జబీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

8 నుంచి విద్య, వైజ్ఞానిక తరగతులు

కర్నూలు సిటీ: ఈ నెల 8,9, 10 తేదీల్లో తిరుపతి నగరంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్య, వైజ్ఞానిక తరగతులు జరుగనున్నాయి. ఈ తరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం క్లస్టర్ యూనివర్సిటీలో వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ చేతుల మీదుగా విడుదల చేయించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక తరగతులకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమణకుమార్, అస్లాం, వీరేష్, రెహానా, సునీత, ప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ఫిల్లింగ్ స్టేషన్ ట్రయల్ రన్ పరిశీలన

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ను సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం నగరపాలక కమిషన్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ త్వరలోనే ఈ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ గ్యారెంటీతో పెట్రోల్, డీజిల్, లూబ్రికెంట్లు అందుబాటులో ఉంటాయన్నారు. స్టేషన్‌లో ఉచితంగా ఎయిర్ చెక్, నైట్రోజన్ గ్యాస్ ఫిల్లింగ్ వినియోగదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా షాకీర్ హుసేన్

కర్నూలు(టౌన్) : నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఇన్‌చార్జ్ ఈఈగా పనిచేస్తున్న షాకీర్ హుసేన్‌కు రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం రాత్రి 585 జీవో ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే నంద్యాల మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించి ఆదోని మున్సిపాలిటీకి బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో చేపట్టిన పదోన్నతుల్లో ఉమ్మడి జిల్లా నుంచి వీరిరువురికీ అవకాశం లభించింది.

కరుణించిన వరణుడు

- విస్తారంగా వర్షాలు
- పొలాల్లో నిలిచి వర్షపునీరు
- పచ్చదనం సంతరించుకున్న పైర్లు



వర్షం రాకతో కోడుమూరు సమీపంలో పచ్చదనం సంతరించుకున్న సజ్జ పైరు

కోడుమూరు రూరల్ : ఎట్టకేలకు వరణుడు కరణించడంతో మండలంలో ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన పంటలకు జీవం పోసినట్లైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెలవారుజామున వరకు వర్షం కురియడంతో మండలంలో 44.8మి.మీ వర్షపాతం నమోదైంది. గత 20రోజుల నుంచి వానలు పడకపోవడం, విపరీతమైన ఎండల వల్ల సాగు చేసిన పంటలన్ని ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ముఖ్యంగా వర్షాధారం కింద సాగు చేసిన ఉల్లి పంట మరో నాలుగైదు రోజుల్లో వానలు పడకపోతే పూర్తిగా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో వరణుడు కరుణించి వాన కురిపించడంతో ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన పత్తి, కంది, వేరుశనగ, సజ్జ, కొర్ర, ఉల్లి వంటి పంటలకు మేలు చేకూరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు లో 51.2 మి.మీ వర్షం

గూడూరు: మండలంలో ఆదివారం రాత్రి 51.2 మి.మీ వర్ష పాతం నమోదైంది. వరుసగా వానలు పడుతుండంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వానలు పంటలకు ఊపిరి పోసిందని రైతులు తెలిపారు.

మండలంలో కొనసాగుతున్న వర్షం

సి.బెళగల్: మండలంలో ఆదివారం మొదలైన తేలికపాటి వర్షం సోమవారం కూడా కొనసాగింది. అదేవిధంగా ఆదివారం రాతి 9:30 నుంచి మొదలైన వర్షం సోమవారం ఉదయం 7:30 గంటల వరకు మోస్తరు వర్షం కురిసింది. దీనితో మండల వ్యాప్తంగా ఆదివారం 9.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం, సోమవారం 28.2 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు మండల గణాంకాధికారి ఆదినారాయణ తెలిపారు.

పంటలకు జీవం

కల్లూరు: గత కొన్ని రోజులుగా మొహం చాటేసిన వరుణుడు రెండు రోజులుగా తిరిగి తన ప్రభావం చూపిస్తుండటంతో పైర్లకు జీవం పోసినట్లు అయింది. మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండలంలో 35.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

ఎడతెరపి లేకుండా వాన ..

పాణ్యం : మండలంలో రెండో రోజు ఎడతెరపి లేకుండా వాన కురసింది. సోమవారం తెల్లవారిన తర్వాత చిన్నపాటి చినుకులతో మొదలై ఉదయం 10గంటల వరకు వర్షం కురిసింది. అధికారులు లెక్కల ప్రకారం 16.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోనవరం గ్రామం వద్ద వాగుకు ఉధృతంగా ప్రవహించింది.

'సుంకేసుల'లో 0.581 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు సోమవారం డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.581 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.